పాదయాత్రలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

'శ్రీరామిరెడ్డి' కార్మికులకు న్యాయం జరిగేదాకా పోరాటం

పాదయాత్రలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి - ఆత్మకూరు

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు న్యాయం జరిగేదాకా పోరాటం సాగిస్తామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు స్పష్టం చేశారు. శ్రీరామ్ రెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో చేపట్టిన పాదయాత్ర గురువారం ఆత్మకూరు మండలానికి చేరింది. బెలుగుప్ప మండలం హనిమిరెడ్డిపల్లి, కాలువ పల్లి మీదుగా ఆత్మకూరు మండలానికి పాదయాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా ఓబులుతో పాటు పాదయాత్రలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పోలీసులు పాలకులు పాదయాత్రను అడ్డుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని అయితే తాము పాదయాత్రను ఆపేది లేదని చెప్పారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు వేతనాలు, పిఎఫ్ అందే వరకు ఉద్యమం ఆగదని చెప్పారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శివ శంకర్, సత్యసాయి వాటర్‌వర్క్స్ యూనియన్ మండల కార్యదర్శి శ్రీ రాములు,నాయకులు రాజేశ్వరమ్మ, సోమశేఖర్‌తో పాటు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

బరువును మించి... బడిసంచి

- కేజీ విద్యకు 5 కేజీల పుస్తకాలు
- విద్యా సంస్థల ఆదాయం కోసం వర్క్ బుక్కులు
- బట్టీ చదువుకు శ్రీకారం చుట్టిన విద్యా సంస్థలు
- మామూళ్లు ఇస్తే మాట్లాడమంటున్న విద్యా శాఖ అధికారులు

తల్లి ఒడిలో ఉంటూ తల్లి చెబుతున్న కబుర్లు వింటూ పెరగాల్సిన చిన్నారులు...పాఠశాలకు వెళ్లి చదువుకుంటు సరదాగా గడపాల్సిన బాల్యం నేడు ప్రయివేటు...కార్పొరేట్ విద్యా సంస్థల్లో బందీ అవుతోంది. కేజీ విద్యకు 5 కేజీల బరువును మోస్తూ తెల్లారిన వెంటనే పాఠశాలలకు పరుగులు పెడుతున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

ఉదయం ఎనిమిది అయిందంటే.. విద్యార్థులు బడి సంచులు భుజాన వేసుకుని భారంగా నడవడం చూస్తుంటాం. మెడ వంగిపోతుందా.. అనేంత బరువుంటుందా సంచి. పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపించే బ్యాగు మోత తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. శక్తికి మించి బరువుండే పుస్తకాల సంచిని మెడలో వేసుకొని వెళ్లడానికి పిల్లలు నానా అవస్థలు పడుతుంటారు. పిల్లల శరీర బరువులో బ్యాగు బరువు 10 శాతం మించొద్దనే విషయమై విద్యావేత్తలు అనేక సార్లు సూచించినా.. ప్రభుత్వాలు నియమించిన విద్యా కమిటీలు ఆ మేరకు ప్రతిపాదనలు చేసినా.. అమలు కొరవడింది. దీనిపై నిర్దిష్ట ప్రయత్నాలు జరగడంలేదని విద్యానిపుణులు, పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం సాధారణంగా 8 నుంచి 10 తరగతి చదివే ఆరోగ్యకరమైన చిన్నారి బరువు 25 నుంచి 35 కేజీలు ఉంటుంది. కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు 10 నుంచి 15 కేజీల బరువున్న పుస్తకాల బ్యాగులను మోసుకుంటూ వెళుతున్నారు. నిబంధనల ప్రకారం 1 తరగతి విద్యార్థి 750 గ్రాములు, 2వ తరగతి 2 కేజీలు, 3, 4 తరగతుల పిల్లలు 3 కేజీలు, 5వ తరగతి 4 కేజీలు, 6 తరగతి 6 కేజీలు, 7వ తరగతి 8 కేజీలు, 8వ తరగతి 10 కేజీలు, 9, 10 తరగతుల పిల్లలు 12 కేజీలు మాత్రమే బరువు మోయాల్సుంది. ఈ నిబంధనలకు భిన్నంగా రెట్టింపు బరువు కన్న ఎక్కువ మోస్తున్నారు. దీంతో వారికి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఆయా స్కూల్ బ్యాగులను మోస్తున్న విద్యార్థులు చిన్న వయసులోనే నడుము, మోకాళ్ల నొప్పులు, ఇతరత్రా అర్థో సమస్యలతో బాధ పడుతున్నట్లు తల్లి దండ్రులు వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్కూలు బ్యాగుల బరువును తగ్గించాలని భావించిన ప్రభుత్వం గతంలో ఆయా పాఠశాలల యాజమాన్యాలకు పలు మార్గదర్శకాలు జారీ చేసింది. కానీ వీటిని అమలుచేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

ప్రయివేటు పాఠశాలల్లో ఇలా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 800 పైగా ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో సుమారు రెండు లక్షల మంది పైగా విద్యార్థులు చదువుతున్నారు. బరువులు పిల్లల ఎదుగుదల, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని యూనిసెఫ్‌తో బాటు వివిధ సంస్థల సర్వేలు చెబుతున్నాయి. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కంటే ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలోనే పుస్తకాల బరువు అధికంగా ఉంటుంది. క్లాస్, ఫెయిర్ వర్క్ కోసం ప్రత్యేకంగా వేరువేరు నోట్ బుక్కులు ప్రతిరోజూ తెప్పిస్తున్నారు. ఇంటికి తీసుకెళ్లాల్సిన అవసరం లేని పుస్తకాలు, నోట్‌బుక్కులను భద్ర పర్చుకునేందుకు తరగతి గదుల్లో అల్మారాలు, ర్యాక్‌లను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. కానీ ఏ ఒక్క పాఠశాలలోనూ ఈ ఏర్పాట్లు లేవు. కొన్ని పాఠశాలలు బహుళ అంతస్తుల భవనాల్లో ఉండటంతో మోత బరువుతో మెట్లు ఎక్కుతున్న విద్యార్థులు వెన్ను, మోకాళ్ల నొప్పులతో సతమతమవుతున్నారు. శక్తికి మించి బరువు మోయడంతో వారి ఎదుగుదలపై కూడా ప్రభావం పడుతోంది.

విద్యాహక్కు చట్టానికి తూట్లు...

విద్యా హక్కు చట్టాన్ని పక్కన పెట్టి జిల్లాలో పలు ప్రయివేటు విద్యా సంస్థలు నిబంధనలను విస్మరించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. భారీగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల జేబులు కొల్లగొడుతున్నాయి. అదే సందర్భంలో పుస్తకాలను వారి వద్దే కొనుగోలు చేయాలని తెల్చి భారీగా ధరలు నిర్ణయించి వసూలు చేస్తున్నారు. యథేచ్ఛగా అమ్మకాలు జరపడమే కాక నోటుబుక్కులు, షూస్, టై, యూనిఫామ్ ఇలా విద్యార్థులకు కావాల్సిన అన్ని రకాల వస్తువులూ అక్కడే కొనుగోలు చేయాలని స్పష్టం చేస్తున్నాయి. బయట కొనుగోలు చేసేవి ఇక్కడ చెల్లుబాటు కావని హెచ్చరిస్తున్నారు.

అధిక ధరలకు విక్రయాలు

ప్రభుత్వ పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి వారికి ఉచితంగా, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలకు తరగతుల వారీగా ప్రభుత్వం పుస్తకాల ధరలను నిర్ణయించింది. 1 నుంచి 10వ తరగతి వరకు తెలుగు మీడియంకు రూ.326 నుంచి రూ.657 వరకూ, ఇంగ్లీషు మీడియంకు రూ.280 నుంచి రూ.674 వరకూ మాత్రమే పాఠ్యపుస్తకాలను విక్రయించాల్సి ఉంది. నిర్ణయించిన ధరలకు మించి ఎక్కువ రేట్లకు అమ్మితే సంబంధిత ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. ఫీజులు, డొనేషన్ల పేరుతో భారీగా సొమ్ములు దండుతున్నారు. బస్సు రవాణా ఛార్జీలను విడిగా వసూలు చేస్తున్నారు. అవే కాకుండా ప్రభుత్వం నిర్ధేశించిన ధరలకు 10 నుంచి 20 శాతం అదనంగా పుస్తకాల కోసం వసూలు చేస్తున్నారు.

అవసరం లేకున్నా వర్కు పుస్తకాలు

ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో పుస్తకాలు...నోటు పుస్తకాలతో పాటు అవసరం లేకున్న వారి ఆదాయం కోసం వర్కు బుక్కులను అంటగడుతున్నారు. దీంతో ఆటపాటలతో గడపాల్సిన బాల్యం నాలుగు గోడల మధ్య పుస్తకాల బందీఖానా అవుతోంది. దీనిపై ప్రభుత్వం ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

చర్యలు తీసుకోనే వరకు ఉద్యమిస్తాం

విద్యను వ్యాపారం చేసి విద్యార్థులను పుస్తకాల పురుగులను చేసి వారి మరణాలకు కారణమవుతున్న ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే విద్యాశాఖ కార్యాలయాలను ముట్టడిస్తాం. నిబంధనలు పాటించని, ఫీజుల పేరుతో, పుస్తకాల నుంచి యూనిఫాం పేరుతో దోపిడీకి పాల్పడితే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అట్టి విద్యాసంస్థలపై ప్రత్యక్ష ఆందోళనలు నిర్వహిస్తాం. దీనికి పూర్తి బాధ్యత విద్యాశాఖ అధికారులదే.

నాగార్జున,
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

క్యూఆర్ కోడ్ ద్వారా ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాల్సిందే

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి రాంభూపాల్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ప్రజలపై విద్యుత్ బారాలు మోపేలా ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన స్మార్ట్ మీటర్ల ను అమర్చరాదని, ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి రాంభూపాల్ డిమాండ్ చేశారు. సిపిఎం నగర కార్యదర్శి వి రామిరెడ్డి అధ్యక్షతన గురువారం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ నగర్ లో విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదులు చేసేలా క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఇంటింటికి పంపిణీ చేసి ప్రజలు ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి రాంభూపాల్ మాట్లాడుతూ సెకి ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. అధికారంలోకి రాకముందు లోకేష్ స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని చెప్పాడని గుర్తు చేశారు. విద్యుత్ ఛార్జీలు పెంచమని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని తుంగలో తొక్కి స్మార్ట్ మీటర్లు బిగింపు వేగంగా రాష్ట్రంలో అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ స్మార్ట్ మీటర్లను కమర్షియల్ కనెక్షన్లకు బిగిస్తున్నారని తెలిపారు. అపార్ట్మెంట్ లకు బిగించడానికి సిద్ధం చేస్తున్నారని రాబోవు కాలంలో ఇంటి వినియోగదారులకి రైతులకు మోటార్లకు కూడా స్మార్ట్ మీటర్లు బిగిస్తారని అన్నారు. దీని వల్ల విద్యుత్ భారం పెరుగుతుందన్నారు. సెకిఒప్పందాలను రద్దు చేయాలని స్మార్ట్ మోటార్లను బిగింపు ఆపాలని, ట్రూ ఆఫ్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సెల్‌ఫోన్‌లో క్యుఆర్ కోడ్‌ను క్లిక్ చేసి ప్రభుత్వానికి వ్యతిరేకతను తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు వలి, ప్రకాష్, జీవ, కుమార్, రాఘవ, హరికృష్ణ, పాల్, మాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని పాటించకపోతే చర్యలు : డిఇఓ

ప్రజాశక్తి - అనంతపురం సిటీ

విద్యా హక్కు చట్టాన్ని ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని డీఈవో ప్రసాద్ బాబు తెలిపారు. ఆయన గురువారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం 12/1 సి కింద విద్యార్థులు ఏ విద్యాసంస్థలు ఎంపిక చేసుకున్నారో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆ పాఠశాలలనే ఎంపిక చేసి పంపించారని. అందులో భాగంగానే గత సంవత్సరం 1149 పాఠశాలలో ఎంపిక చేశారని చెప్పారు. అలాగే బుధవారం కూడా రెండవ విడతగా 164 పాఠశాలలు ఎంపిక చేశారని వారిని కూడా వెంటనే చేర్చుకోవాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆ సంబంధిత పాఠశాలల యాజమాన్యాలు ఏయే విద్యార్థులకు 12/1సి, ఆర్టీ యాక్ట్ కింద అడ్మిషన్ వచ్చిందో వారిని ఆలస్యం చేయకుండా పాఠశాలలో చేర్చుకోవాలన్నారు. ఉచిత విద్య సీట్లపై నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకొని పాఠశాలల గుర్తింపును రద్దు చేస్తామని హెచ్చరించారు. అలాగే పుస్తకాలు యూనిఫాం పేరుతో విద్యార్థులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి - అనంతపురం

వైద్య ఆరోగ్యశాఖలో సేవల్ని మరింత గా మెరుగుపరచడం ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని , వైద్యులు, ప్రభుత్వం పట్ల ప్రజలకు నమ్మకం కలుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. ఆసుపత్రులకు వచ్చే రోగుల సేవలకు తగ్గట్టు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లో ని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, వివిధ అనుబంధవిభాగాలఅధికారులతో సమీక్షసమావేశం నిర్వహించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ ద్వారా చేపట్టిన పెండింగ్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఇకపై ప్రతి నెల మొదటి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించడంజరుగుతుందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించే క్రమంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిపరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.ానున్న రోజుల్లో తానే స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి ఆసుపత్రుల పనితీరును పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపారు. రోగులకు వైద్య సేవలు అందించే క్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అందుకు బాధ్యులపై శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.. ఇటీవల తాను క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేసినప్పుడు అక్కడ ఉన్న వైద్యసేవలు, పరిసరాల వాతావరణం సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వివిధ ప్రాంతాలలో ప్రస్తుతం జరుగుతున్న అభివద్ధి పనుల పురోగతి, బడ్జెట్ మంజూరు, పెండింగ్ పనులకు కారణాలు తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. రాయదుర్గం ,తాడిపత్రి ఏరియా హాస్పిటల్ భవనాలను అక్టోబర్ నెలలోగా కొనకొండ్ల ఆగస్టు ఆఖరిలోగా పూర్తి చేయాలని ఏపీ ఎం ఎస్ ఐ డి సి అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వచ్చే సమావేశానికి ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.ఈ .బి .దేవి, డిసిహెచ్ఎస్ ఇన్‌ఛార్జి డాక్టర్. డేవిడ్ , ఏపీ ఎంఎస్ఐడిసి ఈఈ శ్రీనివాస నాయుడు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డా.షారోన్ సోనియా, వైస్ ప్రిన్సిపల్ డా.శంకర్ నాయక్, జి జి హెచ్ సూపరింటెండెంట్ డా. ఆత్మారాం, ప్రోగ్రాం ఆఫీసర్లు, డా.నారాయణ స్వామి, డా. శ్రీనివాసరెడ్డి, డా. విష్ణుమూర్తి, మలేరియా శాఖ అధికారి డా. ఓబులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

గూగూడుకు పోటెత్తుతున్న భక్తులు

ప్రజాశక్తి-నార్పల

కుళ్లాయిస్వామి ఉత్సవాలకు భక్తులు భారీగా తరలివస్తుండటంతో మండల పరిధిలోని గూగూడు గ్రామం పోటెత్తుతోంది. గురువారం 6వరోజు కావడంతో స్వామి దర్శణానికి భక్తులు భారీగా తరలివచ్చారు. కులమతాలకు అతీతంగా భక్తులు ఆంజనేయస్వామి ఆలయంతోపాటు కుళ్లాయిస్వామి ఆలయంలో చదివింపులు (ఫతేహా) చేయిస్తున్నారు. కాగా శుక్రవారం ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం కుళ్లాయిస్వామి చిన్న సరిగెత్తు జరగనుంది. దీంతో ఈరోజు రాత్రి కుళ్లాయిస్వామి మెరవని ఉంటుంది. ఈ ఉత్సవానికి భక్తులు భారీగా తరలివస్తారు. ఈమేరకు ఇందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసేందుకు ఎంపిడిఒ మమతాదేవి, ఆలయ కార్యనిర్వాహణ అధికారి సాకేతపురం శోభ, ఎస్ఐ సాగర్, ఇఒఆర్‌డి శైలజారాణి, ఆర్డబ్ల్యూఎస్ ఇంజినీర్ జనార్ధన్, తదితరులు గూగూడులోనే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. గ్రామంలో ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచామని సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్ తెలిపారు.

కూటమి ప్రభుత్వంపై సంఘటిత పోరాటం

ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించండి

వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

కూటమి ప్రభుత్వంపై సంఘటిత పోరాటానికి సిద్ధం కావాలని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు అధ్యక్షతన ఎస్సీ సెల్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అనంత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళిత సామాజిక వర్గంపై దాడులు అధికమయ్యాయని అన్నారు. పార్టీలో ఎవరికైనా విభేధాలు ఉంటే పక్కన పెట్టి క్షేత్రస్థాయి నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. 2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎస్సీల సంక్షేమం కోసం ఏకంగా రూ.70 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. పోటీ ప్రపంచంలో రాణించేలా ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం ప్రారంభిస్తే అప్పటి ప్రతిపక్ష నేతలు వ్యతికించిన విషయాన్ని గుర్తు చేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం పరితపించిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా విజయవాడలో 205 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి గౌరవించారన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు అధికమయ్యాయని, అందరూ కలిసికట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా ఎస్సీ విభాగం ముందుండాలని సూచించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి దళితులు, గిరిజనులు పట్టుకొమ్మలని అన్నారు. దళితుల సమస్యలపైనే కాకుండా గ్రామ స్థాయిలో నెలకొన్న సమస్యలను కూడా వెలుగులోకి తీసుకురావాలని తెలిపారు. రానున్న రోజుల్లో మండల, గ్రామ స్థాయిలో ఎస్సీ సెల్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మరో ఆరు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని, ఆ ఎన్నికల్లో వైసీపీ సత్తా ఏమిటో చూపించాలని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు కూడా వేయకుండా చేయడం కోసమే రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నేతలపై దాడులు, అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. దళితుల్లో నాయకత్వం లేకుండా చూడాలన్న కుట్ర జరుగుతోందని, అందులో భాగంగానే మాజీ ఎంపీ నందిగం సురేష్‌పై కేసులు పెట్టి వేధిస్తున్నారని తెలిపారు. ఇలాంటి తరుణంలో ప్రతి ఒక్కరూ వ్యూహాత్మకంగా ముందుకు సాగాలని సూచించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి గ్రామగ్రామానికి వెళ్లి ప్రజలకు చంద్రబాబు చేసిన మోసాలను వివరించాలన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తప్పకుండా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ఎస్సీ సెల్ జిల్లా కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

కెమికల్ ఫ్యాక్టరీల నిర్మాణాలను ఆపాలి

సిపిఎం మండల కార్యదర్శి ఎన్.లోకేష్

ప్రజాశక్తి-డి.హీరేహాల్

మండల పరిధిలోని ఓబుళాపురం పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న రసాయన ఫ్యాక్టరీల నిర్మాణాలను వెంటనే నిలుపుదల చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎన్.లోకేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మండల ంలోని ఓబుళాపురం గ్రామ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న రసాయన ఫ్యాక్టరీల నిర్మాణ ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన పరిశ్రమల నిర్మాణాలతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదంఉ ందన్నారు. ఆదేవిధంగా ఈ ప్రాంతాల్లో ఇలాంటి భయంకరమైన రసాయన పరిశ్రమల నిర్మాణాలను చేపట్టకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కెమికల్ ఫ్యాక్టరీలు నిర్మిస్తే ఓబులాపురంతోపాటు పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అనారోగ్యాల బారిన పడతారన్నారు. అదేవిధంగా ఈ ఫ్యాక్టరీల నుండి వెలువడే కాలుష్యం వల్ల పొలాలు భూసారాన్ని కోల్పోతాయన్నారు. ఫలితంగా రైతులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడతా యన్నారు. కావున వెంటనే కెమికల్ ఫ్యాక్టరీలు నిర్మాణంక ఆంకుడా నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆయా గ్రామాల ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యవర్గ సభ్యులు మల్లికార్జున, సభ్యులు వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ మండలం మోపిడి గ్రామంలో మహిళల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

రాష్ట్ర ప్రభుత్వం చేటప్టిన 'సుపరిపాలన తొలిఅడుగు-ఇంటింటికీ టిడిపి' కార్యక్రమం రెండోరోజు గురువారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా ఎమ్మెల్యేలు, టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నార్పలలో ట్రాఫిక్ అస్తవ్యస్తం

గూగూడు ఉత్సవాల నేపథ్యంలో పెరిగిన వాహనాలు-ప్రజల ఇబ్బందులు

ప్రజాశక్తి-నార్పల

రెండు రోజుల నుంచి గూగూడు కుళ్లాయిస్వామి దర్శనానికి భక్తులు భారీ ఎత్తున వస్తుండడంతో నార్పలలో ట్రాఫిక్ స్తంభిస్తోంది. జిల్లాలో ఎక్కడ నుంచి గూగూడుకు వెళ్లాలన్నా ఎక్కువశాతం నార్పల మండల కేంద్రం మీదుగానే వెళ్లాల్సి ఉంది. దీంతో భారీగా వాహనాలు వస్తుండటంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉత్సవాలు ప్రారంభంకాగానే ఇలా ఉంటే ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలైన చిన్న సరిగెత్తు, పెద్ద సరిగెత్తు, స్వామి అగ్నిగుండ ప్రవేశం, జలది కార్యక్రమాలకు మరింత భారీగా భక్తులు తరలివచ్చే ప్రమాదం ఉంది. ఈ సమయంలో ఇక ఎలా ఉంటుందో అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే కుళ్లాయిస్వామి దర్శనానికి భక్తులు ఎక్కువగా వస్తున్నా.. ఆర్టీసీ బస్సులు మాత్రం తక్కువగా నడుపుతున్నారు. ఈ విషయంపై ఆర్టీసీ డిపో మేనేజర్ నాగభూపాల్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు అనంతపురం నుంచి గూగూడుకు 10 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని, రేపటి నుంచి మరిన్ని బస్సులు పెంచి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. అలాగే ట్రాఫిక్‌పై ఎస్ఐ సాగర్‌తో మాట్లాడగా మండల కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

నార్పలలో ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న జనం, ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన వాహనాలు

10లోపు హెచ్చెల్సీ పనులు పూర్తి కావాలి

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఈనెల 10వతేదీలోపు హెచ్చెల్సీ ఆధునీకరణ పనులన్నీ పూర్తి చేయాలని విప్ కాలవ శ్రీనివాసులు సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. ఈమేరకు నియోజకవర్గ పరిధిలో చేపట్టిన తుంగభద్ర ఎగువ కాలువ మరమ్మతు పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువకు 10వ తేదీ నుంచి నీటిని విడుదల చేయాలని కర్ణాటక అధికారులు తుంగభద్ర బోర్డును కోరారన్నారు. కర్ణాటక అధికారుల విన్నపం మేరకు ఆలోపు పనులన్నీ పూర్తి చేసి నీటి పంపిణీకి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. వైసిపి పాలనలో తుంగభద్ర ఎగువ కాలువ దుస్థితి దయనీయంగా మారిందన్నారు. పాలకుల నిర్లక్ష్యానికి జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. కాలువ బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో సైతం ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదన్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాలువ స్థితిగతులపై అధ్యయనం చేశామన్నారు. కాలువ బలహీనపడ్డ ప్రాంతాలను గుర్తించి యుద్ధ ప్రతిపాదికన పనులు చేయించడానికి రూ.కోటి మంజూరు చేశామన్నారు. జిల్లాపై సిఎంకు ఉన్న ప్రత్యేక అభిమానం, రైతుల పట్ల ఉన్న మమకారంతో వెంటనే రూ.35కోట్లు మంజూరు చేశారన్నారు. కనేకల్లు ప్రాంతాల్లో జరుగుతున్న పనుల విధానం చూస్తే రాయదుర్గ ప్రాంతానికి మంచి రోజులు వచ్చాయన్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి జిల్లావ్యాప్తంగా వెళ్లాల్సిన సాగునీటికి ఎలాంటి అంతరాయం కలగకుండా మార్గం సుగుమం అవుతోదన్నారు. చంద్రబాబు ఆశీస్సులు, జిల్లాకు చెందిన రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేక చొరవతో పనులు వేగవంతం అవుతున్నాయన్నారు. జిల్లా రైతాంగం ఆ ముగ్గురికి ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్చెల్సీ ఇంజినీరింగ్ అధికారులు, టిడిపి మండల కన్వీనర్ లాలెప్ప, ఆనందరాజు, ఆది, సుదర్శన్, వన్నారెడ్డి, బిటి రమేష్, చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.


కాలువ పనులను పరిశీలిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

పిఆర్ ఎస్ఇగా ప్రభాకర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

అనంతపురం : పిఆర్ జిల్లా ఎస్ఇగా ప్రభాకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పిఆర్ ఇఇ నవీన్‌కుమార్, డిఇలు లక్ష్మీనారాయణ, రవీంద్ర, తదితరులు ప్రభాకర్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వ్యవసాయ అభివృద్ధికి సహకార వ్యవస్థ కీలకం

అనంతపురం : వ్యవసాయ అభివృద్ధికి సహకార వ్యవస్థ కీలకమని ఎస్‌వి డిగ్రీ, పిజి కళాశాల వైస్ ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి పేర్కొన్నారు. 103వ ఐవైసి 2025లో భాగంగా నగరంలోని ఎస్‌వి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు 'సహకార వ్యవస్థ'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా సభ్యుల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అవసరాలను పూర్తి చేయడానికి, సహకార సంఘం ప్రధాన లక్షణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ సహకార శిక్షణ కేంద్రం సిఇఒ ఎంబి మురళీమోహన్, ప్రిన్సిపాల్ ఎన్‌ఎవి ప్రసాద్, ఎఒ శ్రీనాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెటీనా పరీక్షల స్క్రీనింగ్

అనంతపురం : రాష్ట్రీయ బాల స్వస్థ ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా గురువారం నగరంలోని పెద్దాసుపత్రి త్వరిత చికిత్స కేంద్రంలో జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ నారాయణస్వామి ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆసుత్రి కడప సహకారంతో కంటి రెటీనా పరీక్షలను 'రెడ్ కామ్' అనే పరికరంతో స్క్రీన్ నిర్వహించారు. ఇందులో భాగంగా బరువు తక్కువగా పుట్టిన, నెలలు నిండక పుట్టిన పిల్లలు, గుండె లోపం, రక్తహీనత ఇతర వ్యాధులతో బాధపడుతున్న 23 మంది పిల్లలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్, కంటి పరీక్ష నిపుణురాలు జ్ఞానప్రసన్న, మేనేజర్ రజిత, స్టాఫ్‌నర్స్ దివ్య, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

చెట్లు నరికితే చర్యలు

బొమ్మనహాల్ : మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో పచ్చని చెట్లు నరికితే చర్యలు తప్పవని ఎస్ఐ నబిరసూల్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎండిపోయిన మొక్కలు, గృహాల్లో ఉన్న పాత చెక్కలు మొహర్రం పండక్కి ఉపయోగించి ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. అలాగే ఎవరైనా సొంత ప్రయోజనాలకు పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రీ సర్వే పరిశీలన

శింగనమల : మండల పరిధిలోని మట్లగొందిలో చేపట్టిన రీసర్వేను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేస్వామి గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా సిబ్బందిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శేషారెడ్డి, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ పి.నారాయణస్వామి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ బషీరున్, సంబంధిత విఆర్ఒలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

'సోలార్' నిర్మాణంపై గ్రామసభ

కళ్యాణదుర్గం రూరల్ : కంబదూరు మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో ఏపీఎన్ హెచ్ఎఎల్, ఎన్ఆర్ఇ డిసిఎపి సోలార్ ప్రాజెక్టు నిర్మాణం కోసం గ్రామ రైతులు, ప్రజలతో ఆర్‌డిఒ వసంతబాబు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ గ్రామసభలో తహశీల్దార్ బాలకిషన్, ఎన్‌టిపిసి అధికారులు శివకుమార్, బాలాజీకుమార్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్, విశ్రాంత తహశీల్దార్ చంద్రశేఖర్, సర్పంచు కోకా ముత్యాలమ్మ, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారిణి ఖుష్బూ కొఠారి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలోని బిసి వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఖుష్బూ కొఠారి సూచించారు. గురువారం అనంతపురంలోని ప్రభుత్వ బిసి స్టడీ సర్కిల్‌లో జిల్లాలోని వసతిగృహ సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాల్లో పరిసరాలు, విద్యార్థుల గదులు, నీటి ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. క్రమం తప్పకుండా విధులకు హాజరు కావాలన్నారు. స్థానికంగా నివాసం ఉండాలని, హాస్టల్ రికార్డులను ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం కావున హాస్టళ్లలో మొక్కలను నాటాలన్నారు. ఈ సమావేశంలో జిల్లాలోని సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంక్షేమ శాఖ అధికారిణి ఖుష్బూ కొఠారి

ఆలయ భూములకు ఖాతా సంఖ్య కేటాయించాలి

ఎపి కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఆలయ భూములకు ఖాతా నెంబర్ కేటాయించి కౌలు రైతులను ఆదుకోవాలని ఎపి కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేశులు డిమాండ్ చేశారు. గురువారం వజ్రకరూరు మండల కేంద్రంలో ఎపి కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని పొట్టిపాడు గ్రామం కాశీయేశ్వరస్వామి, సుంకలమ్మ ఆలయానికి సంబంధించిన భూమిని గత 30ఏళ్ల నుంచి గుత్త చెల్లించి పంట సాగు చేసుకుంటున్నారన్నారు. అయితే వారికి ప్రభుత్వ పథకాలు అందకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ భూములకు ఖాతా నెంబర్, రీసర్వేలో జరిగిన పొరపాట్లను పరిష్కరించాలన్నారు. పొట్టిపాడు గ్రామంలో వంద ఎకరాల్లో 35 మంది కౌలు రైతులు సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. కౌలు రైతలందరికీ అన్నదాత సుఖీభవ పథకం, బ్యాంకు రుణాలు, పంట నష్ట పరిహారం, బీమా, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ నరేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతుసంఘం ఉరవకొండ, వజ్రకరూరు మండలాల అధ్యక్షులు సుంకన్న, సురేంద్ర, నాయకులు తాయన్న, రామాంజనేయులు, వన్నూరప్ప, సుంకన్న, మనోహర్, కుళ్లాయప్ప, పెన్నయ్య, సుంకన్న, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఎపి కౌలు రైతుసంఘం నాయకులు

సమ్మెను విజయవంతం చేద్దాం : సిఐటియు

ప్రజాశక్తి-బెలుగుప్ప

దేశవ్యాప్తంగా జూలై 9న చేపట్టనున్న సమ్మెలను జయప్రదం చేద్దామని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి పిలుపుఇచ్చారు. గురువారం మండల కేంద్రంలోని హమాలీ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా, కనీస వేతనం 26,000 ఇవ్వాలని, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, 10 గంటల పని విధానాన్ని, అధిక గంటల పని విధానాన్ని, రాత్రి సమయంలో మహిళల పని చేసే విధానాన్ని రద్దు చేయాలని, వ్యవసాయ రంగంలో నూతన మార్కెట్ విధానాన్ని, పంటలకు గిట్టుబాటు ధర నిర్ణయించాలని, రుణాలు రద్దు చేయాలని, రైతులకు అన్ని విదాల సహాయం అందించాలని, ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జూలై 9న నిర్వహించనున్న సమ్మెలో ప్రజలు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భీమన్న, మల్లి, సత్యవతి, సుజాత, శంకరయ్య, నారాయణస్వామి, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

'సవీరా'లో అరుదైన వ్యాధికి శస్త్రచికిత్స

ఊపిరితిత్తుల్లోకి వెళ్లిన కిడ్నీ, పేగు, ప్లీహం-విజయవంతంగా సర్జరీ పూర్తి చేసిన వైద్యులు

ప్రజాశక్తి-అనంతపురం

పదివేల మందిలో ఐదుగురికి మాత్రమే వచ్చే అత్యంత అరుదైన డయాఫ్రమాటిక్ హెర్నియా అనే సమస్య అనంతపురంలో ఒక యువకుడికి వచ్చింది. అతడు తీవ్రమైన కడుపునొప్పి, ఎద భాగంలో నొప్పి, ఊపిరి అందకపోవడం, మూడు రోజులుగా వాంతుల లాంటి సమస్యతో అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రికి వచ్చాడు. అతడికి తగిన వైద్య పరీక్షలు చేసి, సమస్య ఏంటో తెలుసుకుని చికిత్స చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి చెందిన కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ ఎన్. మహ్మద్ షాహిద్ ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు.

యువకుడికి సీఈసీటీ పరీక్ష చేస్తే ఎడమవైపు డయాఫ్రమాటిక్ హెర్నియాతో బాధపడుతున్నాడు. అతడి పొట్ట, ప్లీహం, ఎడమవైపు కిడ్నీ, పేగులు ఎద భాగంలోకి వెళ్లిపోయాయి. సాధారణంగా గుండె, ఊపిరితిత్తులు ఉండే ఎద భాగాన్ని పొట్ట నుంచి వేరు చేయడానికి డయాఫ్రం అనే ఒక పొర ఉంటుంది. కానీ ఈ రోగిలో పుట్టుకతోనే అది సరిగా ఏర్పడకపోవడంతో ఇవన్నీ ఎడమవైపు ఊపిరితిత్తి వైపు వెళ్లిపోయాయన్నారు. ఫలితంగా ఊపిరితిత్తి కుచించుకుపోయి, అతడికి సరిగా ఊపిరి అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతోపాటు పొట్ట భాగంలో కొంత గ్యాంగ్రిన్ ఏర్పడే లక్షణాలు కూడా కనిపించాయన్నారు. దీంతో అతడికి అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాల్సి వచ్చిందన్నారు. ఇందులో భాగంగా తెరిచిచూస్తే పొట్ట, ప్లీహం, ఎడమవైపు మూత్రపిండం, కొంత పేగుభాగం అన్నీ ఎడమవైపు ఎదలోకి వెళ్లిపోయాయి, పొట్టభాగం మెలి తిరిగిపోయిందన్నారు. దాన్ని ముందుగా సరిచేసి, తర్వాత ఎడమ కిడ్నీని, లోపలకు వెళ్లిన పేగులను అన్నింటినీ మళ్లీ యథాస్థానంలో ఉంచామన్నారు. ప్లీహం మాత్రం పూర్తిగా మెలి తిరిగిపోవడంతో దాన్ని తొలగించాల్సి వచ్చిందన్నారు. డయాఫ్రంను కూడా రెండు పొరలుగా రిపేర్ చేశామన్నారు.. శస్త్రచికిత్స తర్వాత రోగిని రెండు రోజులు ఐసీయూలో ఉంచి గమనించి ఐదు రోజుల తర్వాత ఎలాంటి ఇబ్బంది లేకుండా సాధారణ పరిస్థితికి చేరుకోవడంతో అప్పుడు డిశ్చార్జి చేశామని వివరించారు.

వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ మహ్మద్‌షాహిద్

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

అనంతపురం : నిరుద్యోగ యువతకు జిల్లా ఉపాధి కార్యాలయంలో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి పల్లవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం మండల కేంద్రంలోని ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం మూడు నెలల ఉచిత నైపుణ్య శిక్షణను ప్రారంభించనున్నట్లు తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత ఉండాలని, 18 నుంచి 30 ఏళ్లలోపు ఉంటే యువత ఉచిత శిక్షణకు అర్హులు అన్నారు. పూర్తి వివరాలకు సెల్..91334 43449 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సప్తగిరి క్యాంపర్ ఫ్యాక్టరీలో మాక్‌డ్రిల్

అనంతపురం : అనంతపురం రూరల్ వడియంపేటలోని సప్తగిరి క్యాంఫర్ ప్రయివేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో పరిశ్రమలు, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఇటీవల పాశమైలారం సిగాచి ఫార్మా కెమికల్ ఫ్యాక్టరీలో చోటు చేసుకున్న ప్రమాదం నేపథ్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రమాదాలపై అవగాహన కల్పించినట్లు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఫ్యాక్టరీ మేనేజర్ హనీఫ్, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి కెపి లింగమయ్య,, అగ్నిమాపక, ఫ్యాక్టరీ సిబ్బంది పాల్గొన్నారు.

మాక్‌డ్రిల్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సృజనాత్మక ఆలోచనల కోసమే హ్యాకథాన్

ప్రజాశక్తి-గుత్తి

ఆవిష్కర్తల ప్రతిభను వెలికితీసేందుకే కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఇ ఐడియా హ్యాకథాన్ 5.0 నిర్వహిస్తోందని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎండి రఘునాథరెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సు ఆవిష్కర్తలు కార్బన్ ఫుట్ ప్రింట్ టెక్నాలజీ, సర్వే లైన్, సైబర్ డిఫెన్స్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ ఇన్ ఏకో సిస్టమ్స్, కోస్టల్, హిల్లీ రీజియన్స్‌లో బిజినెస్ ఆఫ్ గ్రేడింగ్, స్మార్ట్, రెసిలియంట్ సప్లై చైన్ వంటి అంశాలపై తమ ప్రతిభను చాటుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు ఎంఎస్ఎంఇ వెబ్‌సైట్‌ను సందర్శించి గేట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ద్వారా తమ ఆలోచనలు సమర్పించాలన్నారు. ఈనెల 14వ తేదీ ఎంపికైన ఆలోచనలకు రూ.15 లక్షలు ఆర్థిక సహాయం లభిస్తుందన్నారు. గత ఐడియా హ్యాకథాన్ 4.0 లో గేట్స్ విద్యార్థులు రెండు వినూత్న ఆవిష్కరణలు సమర్పించి ఏకంగా రూ.15 లక్షలు, అలాగే రూ.7 లక్షలు నిధులు సాధించడం గర్వకారణమన్నారు. ఈసారి కూడా గేట్స్ విద్యార్థులు రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పూర్తి వివరాలకు సెల్ 9963 014252, 944188218 నెంబర్లను సంప్రదించాలన్నారు.

మాట్లాడుతున్న గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎండి రఘునాథరెడ్డి

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-ఉరవకొండ

గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని మోపిడి గ్రామంలో గురువారం నిర్వహించిన 'సుపరిపాలనలో మొదటి అడుగు' కార్యక్రమానికి హాజరైన మంత్రిని సిపిఎం నాయకులు కలిసి పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ మోపిడి గ్రామంలో రెండు నెలల నుంచి సత్యసాయి నీళ్లు రాకపోవడంతో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. బీసీ కాలనీతో పాటు వివిధ కాలనీలలో సీసీ రోడ్లు లేక మురికి గుంతలు ఏర్పడ్డయన్నారు. డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉండడంతో వర్షం వస్తే ఇళ్లల్లోకి నీరు వస్తుందన్నారు. విద్యుత్ వైర్లు ఇంటి మీదనే వేలాడుతున్నాయని గతంలో మిద్దె మీద ఉన్న కరెంటు వైర్ తగిలి ఒకరికి చేయి పోయిందని గుర్తు చేశారు. 40ఏళ్ల కింద వేసిన కరెంట్ వైర్లు గాలికి తెగిపోయి షార్ట్‌సర్క్యూట్ కావడంతో విద్యుత్ సరఫరా సక్రమంగా లేదన్నారు. అన్నదాత సుఖీభవ రూ.20వేలు ఒకేసారి విడుదల చేసి రైతుల ఖాతాలకు జమ చేయాలన్నారు. ఉపాధి హామీ పనులు చేసిన శ్రామికులకు గత 7,8 వారాల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం సుపరిపాలనలో మొదటి అడుగు కార్యక్రమం చేపట్టిందని, ఆయా సమస్యల పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు మురళి, వీరాంజనేయులు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE, ANANTHAPURAMU
E.P.No. 546/2024 in A.A. No.131/2021

Between:

M/S Shriram Finance Ltd ...D.Hr

V/S

1.K.Balakrishna Reddy
2.Bommaka Divakar Reddy ...J.Drs

NOTICE TO 2ND JDR

To,
Bommaka Divakar Reddy S/o B.Obula Reddy, D.No:6/66, S.Brahmnapalli (V), Sankepalli (P), Mudigubba (M), Ananthapur (D) 515511.

పై E.P. 2వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం ది॥17-07-2025 తేదిన వాయిదా వేయడమైనది. ఆ తేదినాడు ఉ॥10:30 గంటలకు పై కోర్టు ఎదుట మీరు స్వయముగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ ఆస్తి అమ్మకానికి వేయబడిన సదరు E.P. పై మీ ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును. లేనిచో పై పిటిషను మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

S.GOPI,
Advocate for Decree Holder,
Ananthapuram.
Cell No:9440989424.

వాటర్ ట్యాంకు వితరణ

యాడికి : మండల కేంద్రానికి చెందిన అజయ్‌బాబు జ్ఞాపకార్థం లియో క్లబ్ ఆఫ్ యాడికి సభ్యులు మినరల్ వాటర్ ట్యాంకును పాఠశాలకు వితరణ చేశారు. ఈమేరకు ప్రధానోపాధ్యాయులు సీతారామ్ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌యాదవ్ సమక్షంలో గురువారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లియో సభ్యులు తిరుమలేష్, కార్తీక్, రాజశేఖర్, శివ, యువరాజ్, కుమారస్వామి, రాజబాబు, బాబు, నరేష్, గిల్లి, సిద్ధూ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

యాడికి : మండల కేంద్రంలోని ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో వాసవీ కళ్యాణ మండపంలో తాడిపత్రి శ్రీ రాగచరిత క్లినిక్ ప్రముఖ వైద్యురాలు జస్మితారెడ్డి సహకారంతో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 110 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య పవన్‌కుమార్, జీఎస్టీ రవితేజ, కేదార్ నితిన్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నీటి నాణ్యత పరిశీలన

నార్పల : మండల పరిధిలోని కేసేపల్లి, సిద్ధిరాచెర్ల గ్రామాల్లో ఎంపిడిఒ మమతాదేవి గురువారం నీటి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో పంచాయతీల ద్వారా వస్తున్న నీరు ప్రారంభ స్థానం, ముగింపు ప్రాంతం నుంచి నీరు సేకరించి నాణ్యతగా ఉందా.. లేదా.. అని 12 రకాల పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు గ్రామీణ ప్రజలు కలుషితమైన నీటితో ప్రజలు అనారోగ్యానికి గురి కాకూడదనే పరీక్షలు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీదేవి, రాజేశ్వరి, కుళ్లాయప్ప, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మధు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

రాయదుర్గం రూరల్ : పాడి పశువులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యాధికారి సూర్యనారాయణ సూచించారు. గురువారం మండల పరిధిలోని డి.కొండాపురం గ్రామంలో సుమారు 120 సంకరజాతి పశువులకు థైలేరియాసిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ థైలేరియాసిస్ అనేది ఒక ప్రాణాంతకమైన వ్యాధి అన్నారు. వ్యాధి సోకిన పశువుకు బ్యూటలెక్స్ ఇంజక్షన్ (దీని ధర సుమారు రూ.1500 నుంచి రూ.1800) ఉంటుందన్నారు. దీన్ని మూడు డోసులుగా ఇవ్వాలన్నారు. ఈ వ్యాధి వల్ల ఒక్కొక్కసారి పశువు మరణించే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం ఉచితంగా థైలేరియాసిస్ వ్యాధి నిరోధక టీకాలను సరఫరా చేసిందన్నారు. అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి

మార్కెట్ యార్డ్ సిబ్బందికి మెమోలు

అనంతపురం : అనంతపురం మార్కెట్ యార్డులో గతేడాది క్రితం ఎసిబి సిబ్బంది దాడుల సమయంలో అధికారులకు సహకరించకుండా వ్యవహరించిన తీరుపై వివరణ ఇవ్వాలంటూ అప్పటి సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్ కేశవకుమార్‌తోపాటు మరో ఉద్యోగి వేణుగోపాల్‌కు మెమోలు జారీ చేశారు. 15రోజుల్లో వివరణ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం వీరంతా కడప, కళ్యాణదుర్గానికి బదిలీ అయ్యారు.

టిడిపి ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని కెకె పాలెం, తిమ్మలాపురం, దేవరహట్టి, సీసీగిరి గ్రామాల్లో గురువారం టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి ఈ ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, మంజునాథ్, ప్రకాష్, మార్కెట్ డైరెక్టర్ జయన్న, కో కన్వీనర్ ఈరన్న, డీలర్ వెంకటేష్, కృష్ణప్ప, ప్రకాష్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో నాణ్యమైన మెక్కల నారు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మేలైన దిగుబడి వచ్చే మొక్కలను రైతులకు పంపిణీ చేయనున్నట్లు రెడ్డిపల్లి కెవికె శాస్త్రవేత్త జి.త్రికాల మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు రెడ్డిపల్లి షేడ్ నెట్‌లో మిరప, టమోటా, వంగ నారు పెంచి రైతులకు ఇండెంట్ ప్రకారం అందివ్వనున్నట్లు తెలిపారు. చారు. మిరప, టమోటా, బంతి నారు, మునగ మొక్కలు కావాల్సిన రైతులు రెడ్డి కృషి విజ్ఞాన కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

ఇరువెందులలో ఘర్షణ..వ్యక్తి మృతి

శింగనమల : మండల పరిధిలోని ఇరువెందుల గ్రామంలో స్థల వివాదం నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది ఈ ఘర్షణలో మేళా శంకరయ్య (62) తలకు బలమైన దెబ్బ తగలడంతో అనే అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని ఇరువెందుల గ్రామంలో మేలే శంకరయ్య ఇంటి ముందు మురికినీరు పోయడంతోపాటు చెత్త వేయడంతో మహిళలు ఒకరికొకరు గొడవపడ్డారు. ఈ గొడవ పురుషుల వరకూ వెళ్లింది. ఈనేపథ్యంలో అమ్మన్న కుమారులు బాల గంగిరెడ్డి, పెద్దిరాజు, దాసరి తిరుపాల్ కుమారులు త్రినాథ్, సీనా, రమేష్, ప్రభాకర్ కలిసి శంకరయ్యతోపాటు కుమారులు నాగేంద్ర, నాగేష్‌పై రాళ్ల, కట్టెలతో దాడి చేశారు. ఈ దాడిలో శంకరయ్యకు తలకు బలమైన గాయం అయింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇరువర్గాలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 ద్వారా అంబులెన్స్‌లో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ విజయ్‌కుమార్ గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మృతిచెందిన శంకరయ్య

గడ్డివామికి నిప్పు

యల్లనూరు : మండల పరిధిలోని చింతకాయమంద గ్రామంలో రైతు ఆలపాటి రంగయ్యానాయుడుకు చెందిన గడ్డివామికి బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. బాధితుడు తెలిపిన మేరకు.. పశువుల మేపు కోసం గడ్డిని వామిగా ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలో గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయిందని వాపోయాడు. దీంతో సుమారు రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లిందన్నారు. గ్రామంలో చెదురు మదురు ఘటనలే కారణమై ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశాడు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

మందునీరు తాగి 16 గొర్రెలు మృతి

బెలుగుప్ప: మొక్కజొన్న పిచికారి చేసే మందు తాగి 10 గొర్రెలు, ఐదు మేకలు, ఒక పొట్టేలు మృతిచెందిన ఘటన గురువారం మండల పరిధిలోని కోనంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గొర్రెల కాపర్లు తెలిపిన వివరాలు మేరకు.. కాలువపల్లి–కోనంపల్లి గ్రామాల మధ్యలో ఓ రైతుకు చెందిన తోటలో మొక్కజొన్నకు పిచికారి చేసే ముందును (యూరియా) డ్రిప్పు ట్యాంకులో కలిపి ఉంచారు. ఆ ద్రావణాన్ని తాగి 16 గొర్రెలు మృతి చెందాయన్నారు. తిప్పయ్యకు చెందిన 5 గొర్రెలు, మహేష్ చెందిన 1 గొర్రె, 1 మేక, వన్నూరుస్వామికి చెందిన 2 గొర్రెలు, 1మేక, రామాంజనేయులు చెందిన 2 గొర్రెలు, అంజనప్ప చెందిన 1 మేక, లింగన్న 1 గొర్రె, 1 పొట్టేలు, కురువ మల్లప్పకు చెందిన 1 మేక మృతిచెందాయి. విషయం తెలుసుకున్న వెటర్నరీ సిబ్బంది ఎర్రిస్వామి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని అస్వస్థకు గురైన గొర్రెలకు సూదులు వేశారు. మృతిచెందిన గొర్రెల విలువ దాదాపు రూ.2.5 లక్షల ఉంటాయన్నారు.

విద్యార్థుల బకాయి ఫీజులు చెల్లించాలని ధర్నా

కళ్యాణదుర్గం టౌన్ : రాష్ట్రంలో బకాయి ఉన్న వివిధ రకాల ఫీజులను వెంటనే విడుదల చేయాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతురాయుడు, కుళ్లాయిస్వామి ఆధ్వర్యంలో వందలామంది విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థుల పెండింగ్ ఫీజులు, ఫీజ్ రియింబర్స్‌మెంట్, వసతి దీవెన సంబంధించిన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈనెల 11న కలెక్టరేట్ ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం డీటీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, వెంకటనాయక్, మంజునాథ, అశ్వర్య, మౌళిక, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో సీట్లు పెంచాలని వినతి

గుత్తి : ఆదర్శ పాఠశాల, కళాశాలలో సీట్లను పెంచాలని వైసిపి ఐటి విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల, కళాశాలలో ఎంతోమంది విద్యార్థులు ప్రవేశం కొరకు ప్రయత్నించిన సీట్లు లభించడం లేదన్నారు. సీట్లు లేకపోవడంతో విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారన్నారు. మండల కేంద్రంలో అదనంగా ఆదర్శ పాఠశాలను నిర్మించాలన్నారు. అలాగే ప్రభుత్వ పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలో నిర్మించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి ఐటి విభాగం నాయకులు జ్ఞానేశ్వర్‌రెడ్డి, విజయ్‌కుమార్, నాగదరని కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ దాణా పంపిణీ

కళ్యాణదుర్గం టౌన్ : మండల పరిధిలోని ముద్దినాయనపల్లిలో పాడిపశువులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో అందించే దాణాను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ మంజునాథ, గ్రామ టిడిపి నాయకుడు మోహన్, మార్కెట్ యార్డు డైరెక్టర్ బలరామ్, నాయకులు హనుమంతునాయక్, నరేష్, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

గుత్తి : మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను గుత్తి మాజీ ఎంపీపీ వీరేష్ కోరారు. ఈమేరకు అనంతపురంలోని ఎంపి నివాసంలో గురువారం ఎంపీని కలిసి శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మహమ్మద్ అలీ, మల్లికార్జున, శివారెడ్డి పాల్గొన్నారు.

6న దంత వైద్యశిబిరం

పామిడి : స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో ఈనెల 6న ఆదివారం లయన్స్ క్లబ్ పామిడి ఆధ్వర్యంలో ఉచిత దంత చికిత్స వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి, లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరంలో అనంతపురంలోని 2వక్రాస్‌లో ఉన్న ప్రఖ్యాత్ డెంటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. కావున మండలవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

యాడికి : ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తాడిపత్రి సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. జాతీయ డెంగీ మాసోత్సవాల్లో భాగంగా సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య సిబ్బందితో కలిసి గురువారం ఆసుపత్రి కాలనీ, కోన రోడ్డు, కోటవీధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడలిలో భారీ మానవహారం ఏర్పాటు చేసి పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి సుమంత్‌రెడ్డి, సిహెచ్ఒ జుబేదా, సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సుపరిపాలన

'తొలి అడుగు'లో మంత్రి, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన 'సుపరిపాలన తొలిఅడుగు-ఇంటింటికీ టిడిపి' కార్యక్రమం గురువారం మండల పరిధిలోని మోపిడి గ్రామంలో నిర్వహి ంచారు. ఇందులో భాగంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతోపాటు ఆప్యాయంగా పలకరి స్తూ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం సమస్య లపై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం 95 కేంద్ర ప్రభుత్వ పథకాలను ఆపేస్తే తాము అధికారంలోకి వచ్చాక రూ.13వేలకోట్లతో 70 పథకాలను పునరుద్ధరించామన్నా రు. చిన్నాభిన్నంగా ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దామన్నారు. అంతేగాకుండా అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలా భావించి ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే పల్లె ప్రగతి సాధ్యం

పామిడి : సిఎం చంద్రబాబుతోనే పల్లెల ప్రగతి సాధ్యమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. మండలంలోని అనుంపల్లి గ్రామంలో 'సుపరిపాలన తొలిఅడుగు-ఇంటింటికీ టిడిపి' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, ఆయన తనయుడు, మండల ఇన్‌ఛార్జి ఈశ్వర్ హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలతోపాటు అభివృద్ధిని వివరించారు. అనంతరం ప్రజల నుంచి సమస్యలపై వినతులను స్వీకరించారు. అంతకుముందు ఒడ్డుగట్టు సుంకులమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రభాకర్‌చౌదరి, జింకల సంజీవకుమార్, బొల్లు శ్రీనివాసరెడ్డి, సురేష్‌రెడ్డి, రామాంజినాయక్, ఐ టిడిపి అధ్యక్షులు ఆవుల శివ, పల్లె శ్రీనివాసులు, సత్యనారాయణరెడ్డి, భాస్కర్‌యాదవ్, ముంటి మడుగు సుంకప్ప, వరి మడుగు రామాంజనేయులు పాల్గొన్నారు.

5న బిటిపి పనులు పున:ప్రారంభం

కళ్యాణదుర్గం రూరల్ : ఈనెల 5వతేదీన భైరవానితిప్ప ప్రాజెక్టు పనులను పున:ప్రారంభించనున్నట్లు ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. గురువారం శెట్టూరు మండలం అయ్యగార్లపల్లిలో 'సుపరిపాలన తొలిఅడుగు-ఇంటింటికీ టిడిపి' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు

మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సునీత

తెలుసుకోవడంతోపాటు ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం పాఠశాలలు ప్రారంభమైన రోజునే తల్లికివందనం పేరుతో ఎంతమంది పిల్లలు అంత మందికి తల్లుల ఖాతాలకు రూ.13వేల చొప్పున జమ చేశామన్నారు. ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేశామన్నారు. దీంతో పాటు మహిళలకు ఉచిత బస్సును కూడా వచ్చేనెలలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. గతంలో జగన్ జలజీవన్ మిషన్ పథకాన్ని నిర్వీర్యం చేస్తే తాము అధికారంలోకి వచ్చాక కేంద్రంతో చర్చించి జలజీవన్ మిషన్‌కు రూ.9వేల కోట్లు తీసుకొచ్చామన్నారు. ఈనేపథ్యంలో మన ప్రాంత జీవనాడి అయిన బీటీపీ పనులను ఈనెల 5న తిరిగి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు టిఆర్ తిప్పేస్వామి, గోళ్ల వెంకటేషులు, గోళ్ల లక్ష్మీదేవి రమేష్, కర్లకుంట రామాంజనేయులు, డిష్ మురళి, గాజుల శ్రీరాములు, గురుప్రసాద్, కొల్లాపురప్ప, చిత్తప్ప, రామరాజు, నగేష్‌యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, కుబేర్ యాదవ్, పాలబండ్ల హనుమంతరెడ్డి, ధనుంజయనాయక్, కొండాపురం అనిల్‌చౌదరి, తహశీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపిడిఒ, జిలాన్‌బాషా, సర్పంచులు కుమార్, పెరుగు తిమ్మరాజు,

రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎంపి అంబికా, ఎమ్మెల్యే అమిలినేని

చెన్నకేశవ, బొజ్జన్న, లాల్‌కృష్ణ, ఎంపిటిసిలు లింగప్ప, ఓబయ్య, క్లస్టర్ ఇన్‌ఛార్జి మురళి, తదితరులు పాల్గొన్నారు..

అనంతపురం రూరల్ : రాప్తాడు నియోజకవర్గంలోని అనంతపురం రూరల్ తాటిచెట్ల గ్రామంలో గురువారం 'సుపరిపాలన తొలిఅడుగు-ఇంటింటికీ టిడిపి' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని వివరిస్తూ ముందుకు సాగారు.

అనంతపురం : 30 ఏళ్ల సమస్యకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పరిష్కారం చూపించారని అనంతపురం అర్బన్ నియోజకవర్గం రుద్రంపేట పంచాయతీ పరిధిలోని చంద్రబాబు కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం రుద్రంపేట పంచాయతీలో సుపరిపాలన తొలి అడుగు-ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, అనంతపురం నియోజకవర్గ పార్టీ పరిశీలకులు లక్ష్మీనారాయణ, నాయకులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, జయరామ్‌నాయుడు, గాజుల ఆదెన్న, గౌస్‌మోదీన్, గుర్రం నాగభూషణ, సాకే లక్ష్మీనరసింహ, ఫిరోజ్ అహ్మద్, సంగా తేజస్విని,రాజారావు, సరళ, సుధాకర్‌యాదవ్, మోహన్‌కుమార్, పిఎల్ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, భక్తవత్సలం నాయుడు, బాలప్ప, ఎస్ఎం బాషా, వేలూరు మారుతీనాయుడు, ఈడిగ నాగభూషణం, వెంకటరాముడు, కొత్తకోట ఖాసీం, కదిరప్ప ఉపాల్గొన్నారు.



వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ఎమ్మెల్యే గుమ్మనూరు, తనయుడిని సన్మానిస్తున్న అనుంపల్లివాసులు

ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ కన్వీనర్‌గా సోమశేఖర్

ఉరవకొండ : ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎంఆర్‌పిఎస్ ఉరవకొండ నియోజకవర్గ కన్వీనర్‌గా రాయంపల్లి సోమశేఖర్‌ను ఎంపిక చేసినట్టు జిల్లా కమిటీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సోమశేఖర్‌ను దళిత సంఘాల ఆధ్వర్యంలో ఉరవకొండలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు.

27న బెస్త ఉచిత వివాహాల పరిచయ వేదిక

అనంతపురం సిటీ : జిల్లా బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27న ఆదివారం అనంతపురంలోని గంగపుత్ర కమ్యూనిటీ హాల్లో ఉచిత వివాహ పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు బెస్త సేవా సంఘం నాయకులు తెలిపారు. ఈమేరకు గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, చెన్నై, మహారాష్ట్రల్లో ఉన్న బెస్త గంగపుత్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షులు కెవి రమణ, గౌరవాధ్యక్షులు చంద్రబాబు, పుల్లయ్య, ఉపాధ్యక్షులు గంగప్ప, ట్రెజరర్ నాగేంద్ర, వెంకటేష్, గంగాధర్, హరినాథ్, శంకర్, బిఎ శ్రీనివాసులు, శేషాద్రి, కె.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం

యాడికి : ఆహారున్ బాబు(అజయ్) జయంతిని పురస్కరించుకుని ఆయన మిత్రులు కుమార్, సురేష్, సునీల్, వేణు స్థానిక జడ్పీహెచ్ హైస్కూల్‌లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థికి రూ.10వేలు అందజేశారు. తమ మిత్రుడు తమతో లేకపోయినా ఆయన ఆశయాల్లో ఎప్పుడూ ఉంటాడన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పెద్దలు అబ్దుల్ రజాక్, కులశేఖర్‌నాయుడు, కృష్ణమూర్తి చౌదరి, కోడి సునీల్, చంద్రశేఖర్, గుండా నారాయణస్వామి, లక్ష్మీనరసింహ, జనార్దన్, విశ్వనాథ్, విశ్వం, ఆకుల సురేష్, అరుణ్‌బాబు, కెవి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కండి

పరిరక్షణ జెఎసి కన్వీనర్ సాకే హరి

ప్రజాశక్తి కళ్యాణదుర్గం రూరల్

ఆర్డీటీని కాపాడుకోవడానికి ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆర్డీటీ పరిరక్షణ జెఏసి కన్వీనర్ సాకే హరి పిలుపునిచ్చారు. గురువారం పట్టణ సమీపంలోని అక్కమాంబ ఆలయ ఆవరణలో వివిధ ప్రజా సంఘాలు,కుల సంఘాల నాయకులు, ఆర్డీటీ లబ్ధిదారులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీ నిధులు రాకుండా అడ్డుకోవడం చాలా అన్యాయమన్నారు. పేదలకు ఆర్డీటీ చేసిన సేవ లను ఎప్పటికీ మర్చిపోలేని విధంగా ఉన్నాయ న్నారు. అలాంటి సంస్థకు విదేశీ నిధులను పున రుద్ధరించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికై నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెంటనే ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎను రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కళ్యాణదుర్గం పరిధిలోని మండలాల అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో వైసి ఓబయ్య, మాజీ జడ్పిటిసి కొల్లాపురప్ప, ఎంఆర్‌పిఎస్ అక్కులప్ప, సర్పంచు మల్లిపల్లి నారాయణ, ఎంఎస్ హనుమంతురాయుడు, నిజవల్లి బాబు, లింగప్ప, చెలిమప్ప, సీటీటీలు మహిళలు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ గురువారం వార్షిక తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో బకాయిలు వసూలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎర్రిస్వామి, పాఠకులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ఉరవకొండ : ఉరవకొండలోని లక్ష్మీనరసింహ కాలనీలో ఉన్న ప్రభుత్వ హైస్కూల్లో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయురాలు నిర్మల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. అనంతరం బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలుకుతూ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సాకే భాస్కర్, గోపాల్‌కృష్ణ, రామాంజనేయులు, శ్రీనివాసులు, పార్వతి, రుష్యేంద్ర స్వామి, శివప్రసాద్ పాల్గొన్నారు.